

# లిటిల్ రాస్కెల్

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**"ఆ కార్యక్రమం ముందు** ఓ సర్‌ప్రయిజ్ ఐటం. మాష్టర్ కె. రాజేష్ కుమార్ అనే ఏడేళ్ళ కుర్రాడికి "పల్లకి" వారపత్రికలో "దేముడికో లేఖ" అనే పోటీలో ప్రథమ బహుమతి వచ్చింది అని తెలియచేయటానికి సంతోషిస్తున్నాను. ఆ కుర్రాడు ఇప్పుడు ఇక్కడ థియేటర్‌లోనే వున్నాడు. రాజేష్ తల్లిదండ్రులు దయచేసి ఆ కుర్రాడిని స్టేజ్ మీదకి పంపవలసిందిగా కోరుతున్నాం. మాష్టర్ రాజేష్ ఎక్కడున్నా స్టేజ్ మీదకి రావాలి."

"ఈలోగా మేడ్ ఫర్ ఈచ్ అదర్ కపుల్స్ స్టేజ్ మీదకు రండి. మిస్టర్ అండ్ మిసెస్ కర్తార్ సింగ్."

"రాజేష్‌ని స్టేజ్‌మీదకు ఆహ్వానిస్తున్నారు" ఆశ్చర్యంతో కూడిన ఆనందంలో చెప్పాడు దశరథరామయ్య నీరజతో.

"అవును. అప్పుడే ఆ సంగతి ఎలా తెలిసింది?"

"ఫోటో చూసి వుంటారు."

సాహితి వచ్చి "హలో" అని నీరజని గర్వంగా విష్ చేసి, "రాజేష్ కంగ్రాట్స్. కమ్ విత్ మి" అని చెయ్యి పట్టుకుని లాగింది.

దశరథరామయ్య, నీరజ, రాజేష్ ఏం జరుగుతుందో అర్థంచేసుకునే లోపలే సాహితి రాజేష్‌ని గబగబా స్టేజ్ వెనకవున్న మేకప్ రూమ్‌లోకి తీసుకెళ్ళి చెప్పింది.

"బాగా దువ్వుకో. అంతా నిన్ను చూస్తారట. పౌడర్ రాసుకో, యిందు."

కుమారి సీతాదేవి మిస్టర్ అండ్ మిసెస్ కర్తార్ సింగ్‌లకి మెమొంటోలు అందించి చెప్పింది.

"కంగ్రాచ్యులేషన్స్ యు ఆర్ రియల్లీ ఛార్మింగ్ కపుల్."

ఇద్దరు తెల్లగా, హుందాగా, లేత నీలంరంగు బట్టల్లో ఎంతో ఆహ్లాదంగా వున్నారు.

"నెక్స్ట్... మిస్ట అండ్ మిసెస్ పిచ్చయ్య.."

తెల్లటి బట్టల్లో మల్లెపువ్వులా వున్న ఓ పాతికేళ్ళ యువకుడు, పందొమ్మిదేళ్ళ యువతి వచ్చి సభికులకి నమస్కరించారు. ఎంతో ముచ్చటగా వున్నారు ఆ యిద్దరు. కుమారి సీతాదేవి ఆ అమ్మాయి భుజం మీద తట్టి ప్రత్యేకంగా కంగ్రాట్స్ చెప్పి మెమొంటోలని అందించింది.

"చివరగా మిస్టర్ అండ్ మిసెస్ కె. సాంబశివరావు."

నీరజ గుండె ఝల్లుమంది ఆ మాటలు వినగానే. అప్పుడు తట్టింది తమకి వివాహం అయింది ఆ సంవత్సరమే అని. అసలు తమనేనా??"

"పద" సాంబశివరావు ఆనందంగా నీరజ చేతిని అందుకుని చెప్పాడు.

"మనల్నే...?"

"మనల్నే." సాంబశివరావు మొహం సరిగ్గా తుడుచుకోకపోవడంవల్ల ఇంకా ఇందాకటి విచిత్ర వేషధారణ తాలూకు రంగు అక్కడక్కడా అంటివుంది. నీరజ అప్రయత్నంగా అతని మొహాన్ని కొంగుతో తుడిచింది. స్టేజ్ మెట్లవైపు నడుస్తున్న ఆ ఇద్దరివంకా చూస్తూంటే దశరథరామయ్య మనసు ఆనందంతో ఉప్పొంగిపోతోంది.

ఇద్దరూ స్టేజ్ మీదకు వెళ్ళబోతుండగా ఆగమని సౌంజ్ఞ చేసింది సాహితి సైడ్ కర్టెన్‌లోంచి. రాజేష్‌ని స్టేజ్ మీదకి తీసుకెళ్ళి ఆ అనౌన్సర్ చెవిలో ఏదో చెప్పింది.

"ఇతనే మాష్టర్ కె. రాజేష్ కుమార్. 'పల్లకి' వారపత్రిక నిర్వహించిన "దేముడికో లేఖ" అనే పోటీలో బహుమతి వచ్చింది. ఇప్పుడు రాజేష్ ఆ లేఖ మీ అందరికీ చదివి వినిపిస్తాడు."

సాహితి ఆ పత్రిక రాజేష్‌కి అందించి చెవిలో చెప్పింది. "చదువు"

రాజేష్ దాన్ని చూడకుండా వెనక్కి దాచేసి ఆ ఉత్తరాన్ని మైక్‌లో చదివాడు.

అందాక ఎవరికీ కొట్టనన్ని చప్పట్లు కొట్టారు ప్రేక్షకులు. నలుగురయిదుగురు ఈలలు కూడా వేశారు ఉత్సాహంగా.

"ఇప్పుడు మిష్టర్ అండ్ మిసెస్ కె.సాంబశివరావుని స్టేజ్ మీదకి రమ్మని కోరుతున్నాను. క్రితం సంవత్సరమే 'బెస్ట్ డ్రస్ట్ బేచ్‌లర్'గా ప్రయిజ్ వచ్చిన విషయం ఇక్కడ చెప్పితీరాలి.

ముందు సాంబశివరావు, వెనుక నీరజ స్టేజ్ మధ్యకి వచ్చి ప్రేక్షకులకి నమస్కారం చేశారు. కుమారి సీతాదేవి అందించిన మెమొంటోని అందుకున్నారు.

"బాబూ మీ అమ్మపేరేమిటి?" సాహితి రాజేష్‌ని అడిగింది.

"సావిత్రి" చెప్పాడు.

ప్రేక్షకులకి స్పీకర్స్‌లోంచి ప్రశ్న, జవాబు వినిపిస్తున్నాయి.

"ఏం చదువుతున్నావ్?"

"సెకండ్ స్టాండర్డ్."

"మీ వూరు?"

ఆ ప్రశ్నకి సమాధానం చెప్పలేదు రాజేష్.

కొద్దిగా సందేహించి అడిగింది సాహితి. "నీకు బహుమతిగా వచ్చిన డబ్బు మీ నాన్నకిస్తావా, నువ్వే దాచుకుంటావా?"

"నాన్నగారికిస్తాను."

"మీ నాన్నగారి పేరు?"

"...."

"ఆయనేనా మీ నాన్నగారు?" సాంబశివరావు వంక వేలుపెట్టి చూపించి అడిగింది.

రాజేష్ సందేహించాడు.

"చెప్పు. ఈయనేనా? 'పల్లకి'లో ఈయనే నీ తండ్రి అని రాశావుగా?"

అప్పటికే ప్రేక్షకులలో నిశ్శబ్దం ఆవరించుకుంది.

"అవును" సందేహిస్తూ చెప్పాడు.

"పేరు?"

"సాంబశివరావు."

"ఈవిడ?"

"పిన్ని."

"నో - హి ఈజ్ నాట్ మై సన్?" అరిచాడు సాంబశివరావు. అప్పటికే సాంబశివరావుకి ముచ్చెమటలు పోశాయి.

ఆడిటోరియంలో నిశ్శబ్దం. చీపురుపుల్ల మెత్తటి కార్పెట్ మీద పడ్డా వినపడేటంత చిక్కటి నిశ్శబ్దం నీరజ చెవులకి వినపడుతోంది.

"లాస్ట్ ఇయర్ మీకు బెస్ట్ డ్రెస్డ్ బేచులర్‌గా అవార్డు వచ్చిందా?" అడిగింది సాంబశివరావుని.

క్రిందనుంచి ఈలలు, అరుపులు, చప్పట్లు మరీ దూరం నుంచి 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అన్న పాట వ్యంగ్యంగా..

సాహితి నవ్వుతూ నీరజని ఓరకంటితో చూసి స్టేజ్ మీదనుంచి బయటకు నడిచింది.

సాంబశివరావు, నీరజ కదిలారు.

రాజేష్ నీరజ చేతిని పట్టుకున్నాడు నడుస్తూ.

నీరజ ఆ చేతిని విదిలించి కొట్టింది.

స్టేజ్ దిగి ఇద్దరూ నడుస్తూంటే, అంతా తమవంకే గుచ్చి గుచ్చి చూస్తున్నారు."

"హల్లో గురూ నీకు వేషాలేయడంలో బహుమతి వచ్చి తీరుతుంది."

"మీ ఆవిడ బ్రాడ్ మైండెడ్ నెస్‌ని మెచ్చుకోవాలి."

"యు హేవ్ సచ్ ఎ లవ్లీ సన్.."

నీరజకి దెబ్బమీద దెబ్బ పడుతున్న భావన. అతి బలవంతంగా ఏడుపుని అణచుకుంటోంది.

"పద. వెళదాం."

ఇద్దరూ బయటికి నడుస్తూంటే తనని నీరజ ఎందుకు చేతిని పట్టుకోనివ్వటం లేదో పూర్తిగా అర్ధంకాని రాజేష్ వాళ్ళ వెంట బయటకి నడిచాడు.

"ఇంటికా? ఇంకా వుందిగా?" అడిగాడు రాజేష్.

"నా శ్రాద్దం. నీ చావు నువ్వు చావక మమ్మల్నెందుకిలా పీడించుకుతుంటావ్‌రా?" గొంతు చించుకుని అరిచింది నీరజ వుద్రేకంగా.

"ఊర్కో అంతా వింటున్నారు" సాంబశివరావు ఏడుస్తున్న భార్య భుజం చుట్టూ చెయ్యివేసి నడిపిస్తూ చెప్పాడు.

"తాతయ్యా" థియేటర్ నుంచి బయటకు వచ్చిన దశరథరామయ్యని వాటేసుకున్నాడు రాజేష్ భోరున ఏడుస్తూ. తనని ప్రేమగా చూసే పిన్ని నుంచి అలాంటి మాటలు ఎదురు చూడలేదు రాజేష్.

సాంబశివరావు స్కూటర్ స్టార్ట్ చేస్తూ థియేటర్ వైపు చూశాడు. చాలామంది బయటకి వచ్చి తమవంకే చూస్తూండటం గమనించాడు. తను బ్రహ్మచారన్న సంగతి ఆఫీసు మొత్తానికీ తెలుసు. ఆఫీసులో వాళ్ళే తమ చెల్లెలిని లేదా కూతుర్ని చేసుకుంటావా అని అనేకసార్లు అడిగారు. ఈ మధ్యే జరిగిన తమ రిసెప్షన్‌కి చాలామంది వచ్చారు. దశరథరామయ్య దగ్గర రాజేష్ సురక్షితంగా వున్నాడని తెలిశాక స్కూటర్ పోనిచ్చాడు.

వెనకాల నుంచి నీరజ వెక్కి వెక్కి ఏడ్చే చప్పుడు వినపడుతోంది.

"ష్! ఊర్కో" కుడిచేత్తో నీరజ తలమీద రాశాడు స్కూటర్ పోనిస్తూనే.

"ఛీ!ఛీ ఇంత ద్రోహం చేస్తాడనుకోలేదు. బాధనంతా మనసులో దాచుకుని చిన్నపిల్లవాడని యింతచేస్తే.."

"నేను యూనియన్ మనిషిని. యూనియన్‌లో నాకు సవాలక్ష గొడవలు. అందుకని నేనంటే గిట్టనివారు అరిచారు అంతే. అదేం పట్టించుకోకు."

దశరథరామయ్య రాజేష్‌ని ఆటోలో ఎక్కించుకుని ఇంటికి బయలుదేరాడు.

"ఏమైంది తాతయ్యా? నేనేం తప్పు చేశాను?" అడిగాడు రాజేష్ ఏడుస్తూ.

"నువ్వు కాదు, ఊర్కో"

"మరి పిన్ని నన్నెందుకు అలా తిట్టింది.?"

"ఏం లేదు. ఊర్కోమన్నానా?"

"మీ అబ్బాయి మానాన్న కాదా? ఏదో వుంది .నువ్వు చెప్పడంలేదు తాతయ్యాణ

ఆ సమయంలో, రవీంద్రభారతిలో..

"బిచ్చగాడి పాత్రలో ప్రథమ బహుమతి పొందిన కె. సాంబశివరావుని స్టేజ్ మీదకి రమ్మనమని కోరుతున్నాం" అని అనౌన్స్ చేస్తూంటే, చాలా చప్పట్లు, కొన్ని కేకలు, ఈలలు.

దశరథరామయ్య దారిలో ఓ కిళ్ళీకొట్టు దగ్గర ఆటో ఆపించి ఓ చుట్ట కొన్నాడు.

"నాకు మనసేం బాలేదురా. ఈ ఒక్కటి తాగనీ" రాజేష్‌తో చెప్పి దాన్ని అంటించుకున్నాడు.

ఆ ఆడిటోరియంలో ఒకే ఒక వ్యక్తి వాళ్ళ గురించి, ముఖ్యంగా నీరజ గురించి బాధపడ్డాడు.

ఆయన సైకాలజీ ప్రొఫెసర్ మేల్‌ఖోటే.

ఆ రాత్రి దశరథరామయ్య ఇంట్లో అంతకు మునుపెన్నడూ లేని అనీజీనెస్ అలుముకుంది. నీరజతో మాట్లాడటానికి దశరథరామయ్యే భయపడ్డాడు. ఓసారి పలకరిస్తే మొహం తిప్పుకుని జవాబు చెప్పలేదు ఆమె.

సాంబశివరావు నిశ్శబ్దంగా తమ గదిలో కూర్చుని ఓ పుస్తకం తిరగేయసాగాడు. నీరజ వంటగదిలోకి వెళ్ళిపోయింది. దశరథరామయ్య పడక్కుర్చీలో కళ్ళు మూసుకుని పడుకున్నాడు. రాజేష్ ఇంగ్లీషు వాచక పుస్తకం చదువుతూ హాల్లో ఓ మూల కూర్చున్నాడు.

తన వల్ల ఏదో పొరపాటు జరిగిందని గ్రహించాడు. కానీ రాజేష్‌కి పూర్తిగా అర్థంకాలేదు అదేమిటో. ఎవరినీ పలకరించే ధైర్యం లేదు. మాటి మాటికీ రాజేష్ చెవుల్లో ప్రతిధ్వనిస్తోంది. స్టేజ్‌మీద సాంబశివరావు అన్న మాటలు.

రాత్రి తొమ్మిదిన్నరకి నీరజ తమ గదిలోకి వెళ్ళిపోయింది. మంచం మీద దుప్పటి నేలమీదకి లాక్కుని పడుకుని చెప్పింది.

"వెళ్ళి తినండి."

"నువ్వూ?"

"తిన్నాను."

లేచి సాంబశివరావు ముందు గదిలోకి వెళ్ళి చెప్పాడు దశరథరామయ్యతో వంటగదిలోకి వెళుతూ "రండి నాన్నగారూ"

ఆయన లేచి రాజేష్ చెయ్యి పట్టుకుని లేపి చెప్పాడు.

"రా నాన్నా! అన్నం తిందాం"

సాంబశివరావుకి గిన్నెలు చూడగానే అర్థమయింది. నీరజ అబద్దం చెప్పిందని. సాంబశివరావు రాజేష్‌కి, దశరథరామయ్యకి వడ్డించాడు.

"నువ్వు?" అడిగాడాయన.

"మీరు కానివ్వండి ముందు."

"నువ్వూ తిను."

"తర్వాత."

"తినమన్నానా?"

"తింటాలెండి."

దశరథరామయ్య గుడ్లెర్రచేసి కొడుకు వంక చూశాడు తీక్షణంగా. తండ్రికి కోపం వచ్చిందని గ్రహించి చెప్పాడు.

"మేం గదిలో తింటాం. మీ కోడలింకా తినలేదు."

ఆయన ముద్ద నోట్లో పెట్టుకునేదాకా బిక్కుబిక్కుమంటూ చూస్తున్నాడు రాజేష్. రాజేష్ ఆయన కోపాన్ని చూడటం అదే మొదటిసారి. పెదవి విప్పలేదు యిక.

"తిను" చెప్పాడు దశరథరామయ్య రాజేష్ వంక చూడకుండా.

భోజనాలయ్యాక హాల్లో పక్కలు పరుచుకుని పడుకున్నారిద్దరూ.

సాంబశివరావు గిన్నల్ని గదిలోకి తీసుకువెళ్ళాడు.

బతిమాలినా నీరజ తినలేదు.

"ఆకలేస్తే మీరు తినండి. నన్ను ఇంకోసారి పలకరిస్తే నూతిలో దూకుతా" అరిచింది నీరజ రౌద్రంగా.

దశరథరామయ్యకి, రాజేష్‌కి వినపడ్డాయి ఆ మాటలు. ఆయన చిన్నగా నిట్టూర్చాడు.

మొదటిసారిగా ఆయన కళ్ళు చెమర్చాయి. కండువాతో కళ్ళు అద్దుకున్నాడు. ఏడుస్తూన్న రాజేష్ భుజం మీద చెయ్యివేసి చిచ్చికొడుతూ చెప్పాడు.

"పడుకో నాన్నా, నిద్రపోమ్మా"

"తాతయ్యా! నువ్వు అచ్చం అమ్మలా మాట్లాడుతున్నావిప్పుడు" చెప్పాడు రాజేష్ నవ్వుతూ.

23

పంచాక్షరరావు తన భార్యకోస్మ వెదికాడు. మూడో వరసలో నీరజ ఖాళీచేసిన కుర్చీలో కూర్చుని ప్రక్కనే వున్న మరొకావిడతో చెప్తోంది.

"మిసెస్ జగన్నాథానికి చెప్పనని మీరు నాకు మాట ఇచ్చిన రహస్యం మీరు ఆవిడకి చెప్పారని ఆవిడ ఇందాక చెప్పింది."

"అరె! మీరు చెప్పారన్న సంగతి ఎవరికీ చెప్పనని మీకు మాట ఇచ్చిందని ఆ రహస్యం నాకూ చెప్పిందే?" పక్కావిడ బదులు చెప్పింది.

"పోన్లెండి ఆమె నాకు చెప్పిన సంగతి మీకు చెప్పనని ఆవిడకి చెప్పనని మాట ఇవ్వండి."

"అలాగే"

"పద."

పంచాక్షరరావు చెప్పులు విడిచేదాకా ఆగలేకపోయాడు. ఈడ్చి భార్య చెంపమీద బలంగా కొట్టాడు.

"నీవు నరరూప రాక్షసివి" కసిగా చెప్పాడు.

చెంప తడుముకుని చిన్నగా నవ్వింది సాహితి.

"రాజేష్ తండ్రి సాంబశివరావు కాడు. నాక్కావలసిన విషయం తెలుసుకున్నాను" చెప్పింది.

ఇక అక్కడ వుండలేక పంచాక్షరరావు బయటకి నడిచి సాంబశివరావు ఇంటికి వెళ్ళి కాలింగ్‌బెల్ కొట్టాడు.

దశరథరామయ్య లేచి వచ్చి తలుపు తీశాడు.

"సాంబా వున్నాడా?" అడిగాడు.

"పడుకున్నాడు. రేపు మాట్లాడుదువు కానీలే."

"ఐయామ్ ఎక్స్‌ట్రీమ్లీ సారీ. నా అపాలజీస్ చెప్పండి."

దశరథరామయ్య మౌనంగా వుండిపోయాడు.

వెనక్కు తిరిగి వెళ్ళిపోయాడు పంచాక్షరరావు.

మర్నాడు ఉదయం కూడా ఆ ఇంట్లో పరిస్థితి అలానే ఉంది. ఎవరితో ఎవరూ మాట్లాడుకోవటంలేదు. అంతా నిశ్శబ్దంగా, యంత్రాల్లా తమ పనులు తాము చేసుకుపోతున్నారు.

నీరజ ఎవరికీ ఏ లోటూ చేయటంలేదు. టిఫిన్, కాఫీ అందించింది. భర్త టిఫిన్ కారియర్‌లో టిఫిన్ సర్దింది. అన్నం వండింది.

వంట గదిలోకి వెళ్ళాడు రాజేష్ భయపడుతూనే. గుమ్మం దాటివచ్చి నిలబడ్డ రాజేష్‌ని చూసింది కానీ పలకరించలేదు నీరజ. దాదాపు ఓ నిమిషంసేపు నిలబడ్డాడు.

ఇక నీరజ మాట్లాడదని నిర్ధారణకి వచ్చాక చెప్పాడు రాజేష్.

"నేనేమైనా తప్పు చేస్తే నాకు తెలియకుండానే చేశాను ఆంటీ. ఐయామ్ ఎక్స్‌ట్రీమ్లీ సారీ."

నీరజ బదులు చెప్పలేదు.

ఆమె నిరాదరణ హృదయానికి మరో దెబ్బ కొట్టడంతో తలవంచుకుని బయటకి నడిచాడు.

మౌనంగా ఓ మూల కూర్చుని డ్రాయింగ్ బుక్‌లో బొమ్మలు గీసుకుంటున్నాడు. సాంబశివరావు, నీరజ కలసి స్కూటర్ మీద వెళ్ళిపోయారు.

ఆ రోజు కట్టు మార్పించే రోజయినా, సాంబశివరావు ఎప్పటిలా రాజేష్‌ని డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళలేదు. కట్టు బాగా తడిసింది. నీరజంటే సైకాలజికల్‌గా భయంగా వుంది అతనికి.

అంతా వెళ్ళిన కాసేపటికి అడిగాడు రాజేష్ దశరథరామయ్యని.

"తాతయ్యా అందరికీ ఎందుకు నా మీద కోపం వచ్చింది? నాన్నగారి పేరు స్టేజ్ మీద చెప్పినందుకా?"

"కాదు."

"ఆయన మా నాన్నగారు కాదుగదా?"

"ఇంక ఆ విషయాలు మాట్లాడవద్దు మనం."

రాజేష్‌ని హాస్పిటల్‌కి తీసుకువెళ్ళాడు దశరథరామయ్య.

డాక్టర్ అప్పటికే వెళ్ళిపోయాడు.

"సాయంత్రం తీసుకురండి" చెప్పింది నర్స్.

ఇంటికి తిరిగి వచ్చేసరికి రాజేష్ వళ్ళు వేడిగా వుంది. టెంపరేచర్ చూశాడు దశరథరామయ్య. నూటరెండు.

పావుగంట తర్వాత దశరథరామయ్య స్నేహితుడు, నీరజ తండ్రి బాలకృష్ణ వచ్చాడు.

కుశల ప్రశ్నలయ్యాక అడిగాడు -

"హనీమూన్ నుంచి వచ్చాక అమ్మాయి బొత్తిగా ఇంటికే రాలేదే?"

"యూనివర్శిటీ, ఇంటిపనితో తీరలేదు. చూడ్డానికి మూరు రాలేదని ఒకటి రెండుసార్లు అనుకుంది కూడా."

"సాయంత్రం వస్తాను. ఈ అబ్బాయెవరు..?" అడిగాడు రాజేష్ వంక చూసి.

"సాయంత్రం వస్తారుగా, అన్ని వివరాలు చెప్తాను."

ఆయన వెళ్ళిపోయాడు.

సాంబశివరావు రవీంద్రభారతి స్టేజ్‌మీద అరచిన అరుపు రాజేష్ చెవుల్లో మాటిమాటికీ ప్రతిధ్వనిస్తోంది.

"నో! హి ఈజ్ నాట్ మై సన్."

దశరథరామయ్యవంక చూశాడు. ఆయన నిద్రపోతున్నాడు.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in